క్లుప్తంగా

పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం : అర్హులైన లబ్ధిదారులు ఎంపీఏవై పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ కేఎస్ఎం ప్రసాద్ తెలిపారు. సోమవారం హౌసింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులు పీఎంఏవై పక్కాగృహాలకు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు భార్యభర్తల ఆధార్ కార్డు జిరాక్సు, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతా, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలుతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆలయంలో చోరీ

రాజంపేట : పట్టణ శివార్లలోని పోలి చెరువు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సోమవారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏడాదిగా ఆలయంలోని హుండీని తెరవకపోవడం గమనార్హం.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి


ప్రతిష్ట ఉత్సవాల్లో గడికోట మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దిన్నెపాడు గ్రామం వడ్డిపల్లిలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రుద్రాక్షలతో అర్చన

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన అన్నపూర్ణదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో 3వ సోమవారాన్ని పురస్కరించుకొని సద్గురువు శివయ్యస్వామి 1100 పంచముఖి రుద్రాక్షలతో అర్చన కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. మండల పరిధిలోని గుండ్లూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న అవధూత చంగయ్య స్వామి సజీవ సమాధి అయిన మండపంలో సద్గురు శివయ్యస్వామి నిర్వహించిన ఈ అర్చన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్ఐ ఎం.శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి బాగా చదివి క్రమశిక్షణతో మెలిగి లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు గంజాయి, పొగ త్రాగడం వంటి చెడు అలవాట్లను దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

ఘనంగా జాతీయ ఫార్మసీ వారోత్సవాలు


జ్యోతిప్రజల్వన చేస్తున్న ప్రిన్సిపల్ స్వర్ణలత

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా.స్వర్ణలత అన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం బ్రోచెర్స్‌ను ఆమె విడుదల చేశారు. వారోత్సవాల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మసీ ఉత్సవాలను వారంరోజులపాటు జరుపుతామన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తామన్నారు.

నామాలగుట్టపై పడిపూజ


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని రామాపురం రోడ్డు మార్గంలో నామాలగుట్టపై వెలసిన అయ్యప్ప స్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో హరిహర తనయుడికి సోమవారం భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. రాయచోటికి చెందిన సంగరాజు సుబ్బరామరాజు, రాజేష్ కుమార్ రాజులు సోమవారం మాలాధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చిరు వ్యాపారం.. చింతలేని జీవనం

- ఆటోలలో వీధుల వెంట ఆకుకూరలు, పూలు, పండ్ల వ్యాపారాలు
- రూ.లక్షల్లో సాగుతున్న వ్యాపారం
- లాభాలు గడిస్తున్న విక్రయదారులు


ఆటోలో సీతాఫలాన్ని అమ్ముతున్న వ్యాపారి

రాయచోటి : ఇంటికి అవసరమైన వస్తువులను గతంలో మార్కెట్‌కి వెళ్లి కొనేవాళ్లం లేదా దొబ్బుడు బండి మీదనో గంపలలో వీధిల్లోకి తీసుకొచ్చి విక్రయించేవారు. కాలనుగుణంగా మార్కెటింగ్‌లో చాలా మార్పులు వచ్చాయి. అలానే మార్కెట్‌లలో దొరికే కూరగాయలు, ఆకుకూరలు ఇప్పుడు ఆటోలు, మ్యాక్సీ వ్యాన్‌లలో పెట్టుకొని వీధుల్లో విక్రయించడమే కాక లాభాలను గడిస్తున్నారు. మిర్చి, టమాటా, కొత్తమీర, పూలను విక్రయిస్తే ఏమి వస్తోంది అని తక్కువగా చూడొద్దు. ప్రైవేటు ఉద్యోగాలు మానేసి కొందరు రైతులే నేరుగా నాలుగు చక్రాల వాహనాల ద్వారా వ్యాపారం చేస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలలోని వారికి ఈ వ్యాపారాలతో ఇప్పుడు రెండు చేతులా సంపాదిస్తున్నారు. దశాబ్దన్నర కాలం కిందటి వరకు కూడా నెత్తిమీద గంప ఆ గంప నిండా ఆకుకూరలు, కూరగాయలు. ఉదయం సంధ్యవేళల్లో గంప వ్యాపారులు వీధుల వెంట తిరుగుతూ కనిపించేవారు, నేడు అలా విక్రయించే వారు కనిపించడం చాలా వరకు తగ్గింది. తరువాత కాలంలో బ్యాగులు, కవర్లు చేత పట్టుకొని సమీపంలోని మార్కెట్‌లో దుకాణాల వద్ద నిల్వ ఉంచిన కూరగాయలను కొనుగోలు చేస్తూ వస్తున్నారు. ఇలాంటి తరుణంలో నిరుద్యోగులు ఆలోచన, ఆర్థికంగా చితికిపోతున్న రైతుల ప్రయత్నం నాలుగు చక్రాల వాహనాలు ద్వారా ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల వ్యాపారం మంచి ఫలితాలను ఇస్తోంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో సాయంత్రం వేళల్లో వాహనాల పైన వ్యాపారం రోజురోజుకు పెరుగుతోంది. ఫలితంగా మార్కెట్ ద్వారా నష్టపోతున్న కమీషన్ల నుంచి ఉపశమనం లభిస్తోంది. వ్యాపారాలకు నేరుగా అందుతున్న డబ్బులతో ఆదాయాన్ని గడిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ డబ్బులు సంపాదించడం. అలాగే ఉపాధి కల్పించడం. మీరు కూడా మీ ప్రాంతాలలో ఇలాంటి వ్యాపారం ప్రారంభించి నాణ్యమైన ప్రమాణాలు పాటిస్తూ చేయవచ్చని అనేక మంది యువకులు, రైతులు నిరూపిస్తున్నారు.

విస్తరిస్తున్న వ్యాపారం

జిల్లాలోని రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరు, కోడూరు తదితర నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండల కేంద్రాలలో సైతం వాహనాల ద్వారా ఈ తరహా వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేలా వెలుతురు వెదజల్లే లైట్లలోనే ఏర్పాటు చేసుకొని వీధుల వెంట తిరుగుతూ విక్రయాలు సాగిస్తున్నారు. వినియోగదారులు కూడా ఇంటి ముందర వచ్చిన బండిలోని కూరగాయలు, పండ్లు, తదితర వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.


ఈ చిత్రంలో టామాట విక్రయిస్తున్న వ్యక్తి శివ. చిత్తూరు జిల్లా కుప్పం చెందినవాడు. డిగ్రీ పూర్తి చేసిన ఇతను ప్రైవేట్ ఉద్యోగం వదిలి ఇలా రాయచోటిలో నాలుగు చక్రాలు వాహనంలో టామాట విక్రయిస్తున్నాడు. సొంత కాళ్లపై నిలబడటమే ఉద్దేశంతో ఈ వ్యాపారం చేస్తున్నట్లు తెలియజేశాడు. కిలో టామాటను రూ.15, 20, 25కు విక్రయిస్తూ, పెట్టుబడులు, ఖర్చులు పోను రోజు రూ.2 వేల నుంచి మూడువేలు వరకు లాభం చూస్తున్నాడు.


నాపేరు రామచంద్ర, మాది గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామం. అర ఎకరా పొలంలో కొత్తమీర సాగు చేశాను. మార్కెట్‌కు తరలించి కమీషన్లు ఇచ్చుకోవడం కంటే సొంతంగా విక్రయించుకోవాలని నిర్ణయించాను. నా కారులోనే కొత్తమీర కట్టలను తెచ్చి రాయచోటిలా ఇలా విక్రయిస్తున్నాను. కట్ట రూ. 20లు నుంచి రూ. 30లకు నేరుగా విక్రయిస్తున్నాం. కష్టం, పెట్టుబడులు పోను మంచి ఆదాయం లభిస్తోంది.

హమాలీలకు కూలీ రేట్లు పెంచాలి


సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న హమాలీలు

రాయచోటి అర్బన్ : సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ హమాలీ కార్మికులకు వెంటనే కూలీ రేట్లు పెంచి ఆమేరకు జీఓను విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 2024 నుంచి సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ హమాలీ కూలీలకు రేట్లు పెంచాల్సి వుండగా సంవత్సరం పూర్తికావస్తున్నా కూలీరేట్లు పెంచకపోవడం దారుణమన్నారు. రేట్ల పెంపు అంశంలో కాలయాపన చేస్తూ హమాలీల శ్రమను దోచుకోవడం తగదన్నారు. కొత్తగా హమాలీలుగా చేరిన వారి పేర్లు కార్పొరేషన్‌లో నమోదు చేయడంతోపాటు పీఎఫ్ నంబర్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. హమాలీలకు ఈఎస్ఐ అమలుకు చర్యలు తీసుకోవాలని, ప్రతినెలా మొదటి వారంలోనే హమాలీల బిల్లులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి క్రిష్ణయ్య, ఏఐటీయూసీ నాయకులు మురళీతో పాటు పెద్దసంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ వరప్రసాద్

చిన్నమండెం : విద్యార్థులు ఉన్నత ఆశయాలను లక్ష్యంగా ఏర్పరచుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుతారని రాయచోటి రూరల్ సీఐ ఎస్.వరప్రసాద్ పేర్కొన్నారు. చిన్నమండెం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సామాజిక భద్రతా – ఉన్నత భవిష్యత్ ప్రణాళికపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ఎస్ఎస్ఎస్ పీఈటీ నవీన్‌కుమార్, సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కుల సాధనలో తల్లిదండ్రులు సహకరించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శివశంకర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : తల్లిదండ్రులు పిల్లల పట్ల సత్ప్రవర్తన మెలిగినప్పుడే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటి రెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి పదోతరగతి పాఠ్యాంశాలు పూర్తి చేశామని, పిల్లలను ఇంటివద్ద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాగా చదివించాలన్నారు. మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. గతంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించామని, వచ్చే మార్చిలో పదిలో మంచి ఫలితాలు సాధించి ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావాలని, దీనిని తల్లిదండ్రులు పూర్తిగా బాధ్యతగా తీసుకొని పిల్లలను బాగా చదివించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, సుజాతమ్మ, శ్రీకళ, సుమియ, విజయకుమారి, శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు నివాస స్థలాలివ్వాలి


చిట్వేలి: మార్గోపల్లి సచివాలయాన్ని ముట్టడించిన సీపీఐ, బీకేఎంయూ నాయకులు


లక్కిరెడ్డిపల్లి: సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేదలు, సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గ్రామవార్డు సచివాలయం వద్ద అర్హులైన పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం పట్టణాలలో నివసిస్తున్న చాలా మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత నివాసం లేక మానసికంగా ఆవేదన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలాలు చూపించి వెంటనే ఐదు లక్షల రూపాయలు రుణం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

సచివాలయం ముట్టడి

చిట్వేలి : గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల ఇంటిస్థలాలు మంజూరు చేయాలంటూ సీపీఐ, బీకేఎంయూ పార్టీలు సోమవారం మండలంలోని మూడు సచివాలయాలను ముట్టడించారు. రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నియోజకవర్గ నాయకులు తిప్పన ప్రసాద్‌ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని మార్గోపల్లి, పోల్లోపల్లి, మైలపల్లి సచివాలయాలను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలతో సచివాలయాలను ముట్టడించి పంచాయతీ కార్యదర్శులకు నివాస స్థలాల అర్హుల జాబితాలను అందజేశామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయడంతోపాటు ఐరన్, ఇసుక, సిమెంట్‌లను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో త్రేతేశ్వరుడికి గిరి ప్రదక్షిణ


పూజలందుకుంటున్న కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి 3వ కార్తిక సోమవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. సోమవారం రాత్రి గిరిప్రదక్షిణను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. ముందుగా బహుదానదికి గంగా హారతి ఇచ్చారు. హారతి అనంతరం గిరి ప్రదక్షిణతో అత్తిరాల పరిసరాలు శివనామస్మరణం హోరెత్తింది. స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నూతనంగా తయారు చేయించిన రథంలో కొలువు దీర్చి గిరి ప్రదక్షిణ జరిపారు. అనంతరం దాతలు లావులూరి రామకృష్ణ, ఉషారాణిల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో సిద్దాలింగారెడ్డి, పోకల ప్రభాకర్, వై.నందకిషోర్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోదకాలు నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ

సిద్దవటం : బోదకాలు వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలను సేకరించినట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌లో, పి.కొత్తపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కమ్మపాలెం గ్రామాల్లో సోమవారం సాయంత్రం రక్త నమూనా సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాలు వ్యాధి నిర్ధారణకు మాధవరంలో 304 మందికి రక్తనమూనాలు సేకరించామన్నారు. పి. కొత్తపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కమ్మపాలెంలో 302 మందికి రక్త నమూనాలే సేకరించారని వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎంపీహెచ్ఎస్ రమణయ్య, ఏఎన్ఎంలు ఉమాదేవి, భార్గవి, రేష్మా, ఖుర్షీద్‌బేగం, ఆశ వర్కర్ ఇమాంబీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సందర్శనతో ఆచరణాత్మక జ్ఞానం

గాలివీడు : విద్యార్థుల్లో ఆచరణాత్మక జ్ఞానం పెంపొందించడం కోసం పారిశ్రామిక సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పీఎంశ్రీ స్కూల్‌లో నిర్వహించిన ఒకేషనల్ కోర్సులో పని అనుభవంలో భాగంగా తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు టైం సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ కంపెనీ తరపున పట్టణంలోని జీమార్ట్ సూపర్ మార్కెట్‌ను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా రిటైల్ రంగానికి సంబంధించిన పలు విషయాలను షాపు యజమానిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరయ్య, శివారెడ్డి, సుబ్బారాయుడు, నాగరాజు, శివానాయక్, పీడీ గంగరాజు, ఒకేషనల్ కోఆర్డినేటర్లు బారు శ్రీను, పైడి కార్తిక్, ఒకేషల్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరి, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

పుల్లంపేట : మండలంలో ఉన్న నవోదయ కోచింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖాధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్‌లు ఆరోపించారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో శ్రీ కనకదుర్గ నవోదయ కోచింగ్ సెంటర్, శ్రీ సౌమ్యనాథ నవోదయ కోచింగ్ సెంటర్‌లలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పించకుండా నిర్వహిస్తున్నారన్నారు. సెంటర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చిన ఇప్పటి వరకు అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోకుండా విద్యార్థులను అవస్థలకు గురి చేస్తున్నారన్నారు. కోచింగ్ సెంటర్‌లపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సెంటర్‌ల నిర్వాహకులు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నవోదయ కోచింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకోకుంటే బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యపూజ స్వామి కల్యాణం


నిత్యపూజ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

సిద్దవటం : సిద్దవటం గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో, కపర్దీశ్వర స్వామి ఆలయంలో మూడవ కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చారు. స్వామివారికి కల్యాణ మహోత్సవంలో భాగంగా శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో స్వామి వారికి గణపతి పూజ, పుణ్యహావాచనం, కంకణాధారణ, జీలకర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలను వేదపండితులు సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ క్రతువును పూర్తి చేశారు. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. అలానే మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పొలానికి దారి సౌకర్యం కల్పించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

చిన్నమండెం : మండల పరిధిలోని బోనమల దళితవాడ ప్రజల వ్యవసాయ భూములకు దారి సౌకర్యం కల్పించి న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నమండెం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ 25 కుటుంబాల వారు గ్రామంలో జీవనం సాగిస్తున్నారని వారికి వంద ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. గతం నుంచి వీరు గొల్లపల్లి నుండి బండ్లబాటను వినియోగించుకుంటూ వ్యవసాయం చేసుకునేవారన్నారు. కానీ బోనమల కస్బాకు చెందిన బషీర్‌ఖాన్, జెండా ఇంసాబ్‌లు వారి భూములకు కంచె వేశారని, దీని కారణంగా దారి సమస్య ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి గ్రామస్తులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పండరయ్య, రెడ్డిసుధాకర్, దళితవాడ గ్రామస్తులు ప్రసాద్, వరదరాజు, ఎర్రయ్య, వీరాంజనేయులు, చిన్నప్ప, ఆనంద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడు రెడ్డయ్య మృతి


టి.రెడ్డయ్య (ఫైల్)

రాజంపేట టౌన్ : విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి ఉద్యమ నాయకుడిగా పేరుగాంచిన టి.రెడ్డయ్య (54) సోమవారం మృతి చెందాడు. రాజంపేట పట్టణానికి చెందిన రెడ్డయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. దీంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేక పోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రెడ్డయ్య మృతి పేదలకు తీరనిలోటు

రెడ్డయ్య మృతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెడ్డయ్య విద్యార్థి దశ నుంచి పోరాట పటిమ ప్రదర్శించేవారని, గతంలో తాము చేపట్టిన అనేక ప్రజా ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కాగా రెడ్డయ్య మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, కమ్యూనిస్టు పార్టీ నాయకులు చిట్వేలి రవి కుమార్, పి.మహేష్, శివరామకృష్ణదేవర, సికిందర్, ఎస్.ముజఫర్ అహమ్మద్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సుబ్రమణ్యంరాజులు వేర్వేరు ప్రకటనల్లో తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్టాపన పూజలు


వీరబల్లి: ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు


పెనగలూరు: పూజలందుకున్న ఉత్సవవిగ్రహాలు

వీరబల్లి : మండలంలో పెద్దివీడు గ్రామ పంచాయతీలోని కొత్తపల్లిలో ఇటీవల నూతనంగా నిర్మించిన సీతారాముల గుడిలో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉదయం నుండి గోపూజ, గణపతి పూజ, విగ్రహాలకు అభిషేకాలు, వేదపారాయణం, మంగళహారతి కార్యక్రమాలను జరిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు, ప్రజలకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటి నుంచి..

పెనగలూరు : మండలంలోని తిరుణంపల్లి గ్రామంలో నేడు (మంగళవారం) నుంచి మూడురోజుల పాటు సీతారామ లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 19వ తేదీ ఉదయం సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, అఖండ ప్రజ్వలన, కలశస్థాపన, అభిషేకం, సాయంత్రం మండల హోమాలు, తీర్థప్రసాదం ఉంటుందని వారు తెలిపారు. 20న ఉదయం పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. బుధ, గురువారాలలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పోటెత్తిన భక్తులు

కార్తిక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. ఆయా ఆలయాల అర్చకులు స్వామి వారికి పూజలు అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. పలువురు నోములు ఆచరించారు.

– సాక్షి, నెట్‌వర్క్


పెనగలూరు: తూర్పుపల్లిలో ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


పుల్లంపేట: కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చిన్నమండెం: అలంకరణలో శివలింగం


చిట్వేలి: అన్నదానానికి బారులు తీరిన భక్తులు


పెనగలూరు: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రామాపురం: హరిహరాలయంలో..


రాజంపేట టౌన్: శివాలయంలో


రాయచోటిలో అఘోరలింగేశ్వరుడు